అధ్వానంగా గ్రామీణ రోడ్లు 2







2 వర్షాల కోసం కప్పతల్లి ఆట..



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


## మాచర్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండలం మచ్చర్ల సర్పంచ్ కట్ట నర్సయ్య గురువారం ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను కలిశారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రం అందజేశారు. మాచర్ల – వెల్మల్ లింక్ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు గ్రామంలో వీధి విద్యుత్ దీపాల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ కట్ట నర్సయ్య తెలిపారు.



## ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలి..: కలెక్టర్




**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలోని రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. తాడ్వాయి మండలం దేమికలాన్‌లోని రైతు కాటిపల్లి రాంమోహన్ రెడ్డి పొలాన్ని సందర్శించారు. 8 ఎకరాల్లో వేసిన ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలించిన అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడారు. జిల్లాలో 2022-23లో ఆయిల్‌పామ్ సాగు ప్రారంభమైందని, ప్రస్తుతం 885 మంది రైతులు 2,533 ఎకరాల్లో సాగు చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 1,300 ఎకరాల లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటికే వెయ్యి ఎకరాలకు రైతులను గుర్తించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 48 మంది రైతులకు చెందిన 180 ఎకరాల్లో కోత పూర్తి కాగా, 76 మెట్రిక్ టన్నుల తాజా పండ్ల గుత్తులు ఉత్పత్తి అయ్యాయని.. రైతులు రూ.18,07,508 ఆదాయం పొందారని వివరించారు. శుక్రవారం జరిగిన మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో జిల్లా వ్యాప్తంగా 19 మంది రైతులు 53.83 ఎకరాల్లో కొత్త మొక్కలు నాటినట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు రాయితీలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి జ్యోతి, హిందుస్థాన్ యూనిలీవర్ ప్రతినిధులు, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## 4న మంత్రి సీతక్క రాక..

**ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే**

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** జిల్లాలో ఈనెల 4న మంత్రి సీతక్క పర్యటించనున్నారు. ఇందల్వాయి మండలంలోని తిర్మన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను ప్రారంభించనున్నారు. ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లిలో రూ.5 కోట్లతో బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల నిర్మించారు. మంత్రి సీతక్క ఈ జూనియర్ కళాశాలను ప్రారంభించనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఐడీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ సాయ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి పొలసాని శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చింతల కిషన్(ఇందల్వాయి), అంబర్ సింగ్ (డిచ్‌పల్లి), నాయకులు నరేష్, రాంచందర్ గౌడ్, సంజయ్ తదితరులున్నారు.

జిల్లాల్లో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కామారెడ్డి పట్టణంలో కొందరు అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఏడు విలీన గ్రామాలున్నాయి. పట్టణంతో పాటు విలీన గ్రామాలతో పట్టణ పరిధి పెరగడంతో మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారాలు జోరందుకున్నాయి. ఈ క్రమంలో శివారు ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా వెంచర్లు వెలుస్తున్నాయి. కొత్తగా ఏర్పాటవుతున్న వెంచర్లకు అనుమతులు లేకున్నా రాజకీయ అండతో ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయి. దాంతో అక్రమ వెంచర్లపై అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నాయి.
- అక్షరటుడే, కామారెడ్డి




# యథేచ్ఛగా అక్రమ వెంచర్లు

■ అనుమతులు లేకున్నా లే అవుట్ల ఏర్పాటు ■ ప్లాట్ల విక్రయాలకు ప్రయత్నాలు ■ చర్యలు చేపట్టిన మున్సిపల్ అధికారులు

మున్సిపాలిటీ పరిధిలో డీటీపీసీ, మున్సిపల్ అనుమతులు లేకుండానే శివారు ప్రాంతాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారు. రాజకీయ నాయకుల అండతో బోర్డులు పెట్టి, రోడ్లు వేసి వెంచర్లుగా మార్చేస్తున్నారు. అధికారిక ఆమోదం లేకున్నా పనులు ముమ్మరంగా సాగుతుండడంతో స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇలాంటి లేఅవుట్లలో కొనుగోలు చేస్తే భవిష్యత్తులో రిజిస్ట్రేషన్, అనుమతుల సమస్యలు వచ్చే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

### ప్లాట్ల విక్రయాలకు ప్రయత్నాలు

అనుమతులు లేకుండానే లేఅవుట్ చేసి ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో ప్లాట్ల విక్రయాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తక్కువ ధర, ఈఎంఐ సదుపాయం అంటూ బ్రోకర్ల ద్వారా ప్రచారం చేసి సామాన్యులను ఆకర్షిస్తున్నారు. కామారెడ్డి చుట్టుపక్కల విలీన గ్రామాల్లో ఇలాంటి ప్రయత్నాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే కొందరు డబ్బులు చెల్లించి మోసపోయినట్లు ఆరోపణలు సైతం ఉన్నాయి.

### మున్సిపాలిటీలో గొడవ

అక్రమ వెంచర్ల విషయంలో కొద్దిరోజుల క్రితం మున్సిపాలిటీలో గొడవ జరిగినట్లుగా ప్రచారం సాగింది. ఓ వెంచర్‌కు అనుమతి ఇచ్చే విషయంలో ఓ ప్రజాప్రతినిధికి కనీస సమాచారం ఇవ్వకుండా అప్రూవల్ ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయంలో అధికారులతో గొడవ కూడా జరిగినట్లుగా ప్రచారంలో ఉంది. మరికొన్ని వెంచర్లకు అనుమతుల



కోసం ఫైల్స్ సిద్ధంగా ఉంచారన్న ప్రచారం జరిగింది. దాంతో వెంచర్ల విషయం బయటకు పొక్కింది. దాంతో కొద్దిరోజులు ఆ వెంచర్ల అనుమతి విషయం పక్కన పెట్టారని తెలుస్తోంది.

### కూల్చివేతలు షురూ..

అనుమతులు లేకున్నా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని, కాల్వలపై కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నారన్న ఫిర్యాదులు మున్సిపల్ అధికారులకు చేరాయి. ఫిర్యాదులు చేసి నెలకు పైగా కావడం, నోటీసులకు సదరు వెంచర్ యాజమాన్యాలు స్పందించకపోవడంతో శుక్రవారం పోలీసులతో కలిసి పట్టణంలోని వికాస్ నగర్‌లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్‌లో కట్టడాలను మున్సిపల్ అధికారులు కూల్చేశారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వెంట ఉండగా జేసీబీలతో సరిహద్దు గోడలు, షెడ్లను కూల్చివేశారు. రోడ్లను తొలగించారు.

### కొనసాగిస్తారా?

పట్టణంతో పాటు పట్టణ శివారులో ఎక్కడికక్కడ భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లు అమ్ముతున్నారు. ఇందులో కొన్నింటికి నామమాత్రపు అనుమతులున్నా మరికొన్నింటికి అసలే అనుమతులు లేవని తెలుస్తోంది. దాంతో త్వరలోనే వాటిపై కూడా చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు. అయితే అక్రమ వెంచర్లు ఏర్పాటు చేయడం, ప్లాట్ల విక్రయాలు జరపడం కొత్తేమి కాదు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోని అధికారులు ఒక్కసారిగా కూల్చివేతలు చేయడం చర్చనీయాంశంగా మారింది. మిగతా వెంచర్లపై కూడా ఇదే స్థాయిలో కూల్చివేతలు చేపడతారా..? ఇంతే దూకుడుగా వ్యవహరిస్తారా..? లేదా రాజకీయ ఒత్తిళ్లతో తోక ముడుస్తారా..? అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

### చర్యలు తప్పవు

కామారెడ్డి పట్టణంలో అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. వికాస్ నగర్ కాలనీలో అనుమతులు లేని వెంచర్లకు మూడుసార్లు నోటీసులిచ్చిన స్పందించకుంటే నిర్మాణాలను కూల్చేశాం. అనుమతులు లేకుండా మరొక రెండు వెంచర్లు చేస్తున్నారన్న సమాచారంతో ఇప్పటికే ఒకదానికి నోటీసులిచ్చాం. మరొక దానికి నోటీసులివ్వబోతున్నాం. ప్రతి వెంచర్‌కు మూడుసార్లు నోటీసులిస్తాం. నోటీసులకు స్పందించకుండా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తాం. - **పర్వతాలు, మున్సిపల్ కమిషనర్**



## పెర్కిట్ పాఠశాలను పరిశీలించిన సబ్ కలెక్టర్

**అక్షరటుడే, ఆర్మూర్:** మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. వారి పాఠ్యాభ్యాసం, చదువులో ఎదురవుతున్న సమస్యలు, పాఠశాలలో ఉన్న వసతులపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదులు, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్ సబ్ కలెక్టర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## యువత 'సర్' ప్రక్రియలో స్వచ్ఛందంగా పాల్గొనాలి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** గ్రామాల్లోని యువత ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియలో స్వచ్ఛందంగా పాల్గొనాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ అన్నారు. ఆయన తన స్వగ్రామమైన డిచ్‌పల్లి మండలం అమృతాపూర్‌లో 'సర్' నమోదులో భాగంగా తహశీల్దార్ సతీష్ రెడ్డి, ఆర్ఐ భూపతి ప్రభు, బీఎల్‌వోలతో కలిసి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా దినేష్ కుమార్ కులాచారి మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుని జన్మహక్కు అని, ప్రతి 20 ఏళ్లకోసారి ఓటర్ల జాబితాను సరిచేయడం ద్వారా తప్పుడు ఓట్లు, దొంగ ఓట్లు, అర్హత లేని వారి పేర్లను, భారతీయులు కాని వారి పేర్లు తొలగిస్తారన్నారు. పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే 'సర్' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సర్పంచ్ గంగారం, మాజీ సర్పంచ్ నర్సింగరావు, నాయకులు కొండేటి బాలన్న, నాయుడు రాజన్న ఉన్నారు.

## గ్రామీణ విద్యార్థుల ప్రతిభకు జాతీయస్థాయిలో గుర్తింపు




**అక్షరటుడే, నిజామాబాద్ రూరల్:** సిరికొండలోని సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు అబాకస్, వేదిక్ మ్యాథ్స్ విభాగాల్లో జాతీయ స్థాయిలో అసాధారణ ప్రతిభ కనబరిచి ఛాంపియన్లుగా నిలిచి అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. నిజామాబాద్‌లోని తన కార్యాలయంలో విద్యార్థులు వి.సాధ్వి, కె.రుగ్వేద, జి.అద్వైత్ రెడ్డిలను ప్రత్యేకంగా సత్కరించారు. అనంతరంవారికి అవార్డులు, సర్టిఫికెట్లు, నగదు ప్రోత్సాహకాలను అందజేసి అభినందించారు. గ్రామీణ ప్రాంతంలో చదువుతూ జాతీయ స్థాయి పోటీల్లో రాణించి అంతర్జాతీయ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరుకోవడం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా విజ్ఞానం, విలువలు, క్రమశిక్షణను అలవర్చుకుని మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కృషి, పట్టుదల, సరైన మార్గదర్శకత్వం ఉంటే గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రపంచ స్థాయి ప్రతిభ వెలుగులోకి వస్తుందనడానికి ఈ విద్యార్థులే నిదర్శనమని అన్నారు. ఇలాంటి ప్రతిభావంతులను తీర్చిదిద్దుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పోటీ స్ఫూర్తిని పెంపొందిస్తున్న సత్యశోధక్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఆర్. నర్సయ్య, ఉపాధ్యాయులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఇమేజ్‌ను పెంచేవిధంగా సిబ్బంది వ్యవహరించాలి: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** పోలీస్ ఇమేజ్‌ను పెంచేవిధంగా సిబ్బంది వ్యవహరించాలని సీపీ సాయిచైతన్య సూచించారు. మెండోరా పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ చేయాలని సబ్ ఇన్‌స్పెక్టర్‌కు సూచనలు చేశారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాల జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు, కళాశాలలో, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విలేజ్ పోలీస్ ఆఫీసర్లు విధులు నిర్వహిస్తున్న పోలీసులు నిక్కచ్చిగా వ్యవహరించి గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ సరిహద్దులో నిర్మల్, మెట్‌పల్లి ఉన్నందున వాహనాల రాకపోకలపై ఎల్లప్పుడూ నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, మెండోరా ఎస్సై సుహాసిని, సిబ్బంది పాల్గొన్నారు.




## పీసీసీ చీఫ్‌పై నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదు: డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని.. అనవసరంగా పీసీసీ చీఫ్‌పై నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి అన్నారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్మూర్ ప్రజలకు రాకేష్ రెడ్డి చరిత్ర మొత్తం తెలుసన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే చూసి ఓర్వలేక పోతున్నారని పేర్కొన్నారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని రాకేష్ రెడ్డికి హితవు పలికారు. ఆయన తాత ముత్తాతల కాలం నుంచి భూస్వాములుగా ఉన్నారన్నారు. స్వయంగా వారే 12 ఎకరాలు దానం చేశారని తెలిపారు. రాకేష్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని పేర్కొన్నారని.. ఆయన వెంటనే రాజీమానా చేస్తా తాము కూడా సిద్ధంగా ఉన్నామని నగేష్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆర్మూర్ ప్రజలే ఆయనను ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తన సీటు కాపాడుకోవడానికి మత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. రాకేష్ రెడ్డి నీట్ పరీక్ష గురించి ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ మాట తప్పదన్నారు. అనంతరం గాంధీభవన్ అధికార ప్రతినిధి ఏబీ చిన్నా మాట్లాడుతూ.. ఆర్మూర్ జంబి హనుమాన్ సాక్షిగా రాకేష్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్ దందా చేస్తూ సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన మహేష్ కుమార్‌ను విమర్శించడం కరెక్ట్ కాదన్నారు. పీసీసీ చీఫ్ రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారని.. దమ్మంటే రాకేష్ రెడ్డి రాజీనామా చేసి ప్రజల మధ్య నిలబడాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## కామారెడ్డిలో కుండపోత.. రోడ్లపైకి చేరిన నీరు

**అక్షరటుడే, కామారెడ్డి:** భారీ వర్షానికి కామారెడ్డి పట్టణం అతలాకుతలమైంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి మొదలైన వాన ఏకధాటిగా రెండు గంటల పాటు కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. నిమిషాల్లోనే పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీల్లోని రోడ్లు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచి వాహనాలు నెమ్మదిగా కదలడంతో ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వాహనాల రాకపోకలకు వర్షం వల్ల అంతరాయం ఏర్పడింది. కాగా.. వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలాలు తడుస్తుండటంతో దుక్కులు దున్నేందుకు, వరినాట్లు ప్రారంభించేందుకు రైతులు సిద్ధమయ్యారు. వాతావరణం ఇలాగే సహకరిస్తే జిల్లా వ్యాప్తంగా వరినాట్ల సందడి మొదలుకానుంది.



## విద్యార్థుల అవస్థలు సర్కారుకు పట్టవా..?

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని దుబ్బ హైస్కూల్‌లో అసౌకర్యాలతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఐద్వా నాయకురాళ్లు అనిత, శ్రీదేవి ప్రశ్నించారు. వారు పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుబ్బా ప్రభుత్వ పాఠశాల లో వర్షం పడితే గ్రౌండ్‌లో కనీసం నిలబడే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్‌లో 450 మంది పిల్లలు ఉన్నారని.. అయితే బాత్‌రూంలు మాత్రం రెండే ఉన్నాయన్నారు. ఆడపిల్లలు వాష్ రూంకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలురు తప్పనిపరిస్థితుల్లో స్కూల్ బయటకు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో చుట్టుపక్కల వాళ్లు విద్యార్థులను దూషిస్తున్నారని ఆమె వాపోయారు. అలాగే తరగతి గదుల్లో టైల్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయని.. ఇవి తగిలి విద్యార్థులు గాయాలపాలవుతున్నారని వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన పుస్తకాలు చిరిగిపోయాయని.. అలాగే తరగతి గదుల్లో బెంచీలు కూడా సరిగ్గా లేవన్నారు. విద్యార్థులకు నాసిరకమైన దుస్తులు పంపిణీ చేయడంతో వారు వేసుకున్న కొన్నిరోజులకే చిరిగిపోయాయని తెలిపారు. విద్యార్థులకు నీటి సౌకర్యం కూడా లేదని.. దీంతో భోజన సమయంలో అవస్థలు పడుతున్నారన్నారు. బాలికలు వాష్ రూంలు సరిగ్గా లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు.



# అధ్వానంగా గ్రామీణ రోడ్లు..

■ అవస్థలు పడుతున్న ప్రజలు.. ■ పెద్దకొడప్‌గల్ మండలంలో దారుణం.. ■ అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

**పెద్దకొడప్‌గల్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీటితో నిండిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కౌలాస్‌కోటకు వెళ్లే భక్తులు భయంభయంగా ఈ రోడ్లపై ప్రయాణాలు సాగిస్తున్నారు.**

**– అక్షరటుడే, పెద్దకొడప్‌గల్**

మండలంలోని అంజనీ నుంచి శివపూర్, చావని తండా నుంచి సముందర్ తండాకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. శివపూర్ గ్రామ సమీపంలోని వంతెనపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఈ గుంతల్లో పడి తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డంతా చెరువును తలపిస్తుండడంతో పాదచారులు, పొలాలకు వెళ్లే వ్యవసాయ కూలీలు నడవలేక నానా అవస్థలు పడుతున్నారు.



### అంబులెన్స్‌కూ కష్టమే..

సముందర్ తండా నుంచి మండల కేంద్రానికి వచ్చే బీటీ రోడ్డు అంతా గుంతలమయం కావడంతో, అత్యవసర సమయాల్లో అంబులెన్స్ వంటి వాహనాలు గ్రామాలకు చేరుకోవడం గగనంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంగ్టి మండల ప్రజలు బిచ్కుంద, బాన్సువాడ, దెగ్లూర్, నిజామాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు దూరం తగ్గుతుందనే ఉద్దేశంతో ఈ దారి గుండానే ప్రయాణిస్తుంటారు. అయితే, ఈ షార్ట్‌కట్ రోడ్డు కాస్తా ఇప్పుడు నీటి గుంతలతో ప్రయాణికులకు శాపంగా మారింది. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.



### కొట్టుకుపోయిన వంతెన.. ఆదమరిస్తే అంతే..

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కౌలాస్ కోటలోని ఎల్లమ్మ దేవాలయానికి దైవదర్శనానికి వెళ్లే భక్తులు ఎల్లమ్మ రోడ్డుపై నిత్యం భయంభయంగా ప్రయాణిస్తున్నారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఆలయ దారిలో ఉన్న వంతెన సగభాగం కొట్టుకుపోయింది. ఏడాది గడుస్తున్నా దీనికి మరమ్మతులు చేయలేదు. వంతెన దాటే సమయంలో వాహనదారులు కొంచెం ఆదమరిచినా భారీ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. గ్రామీణ రోడ్లు ఇంతలా అధ్వానంగా మారినా, వంతెనలు కొట్టుకుపోయినా అధికారులు మాత్రం కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, మండలంలోని రోడ్ల పరిస్థితిని పర్యవేక్షించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, కౌలాస్ కోట వంతెనను పునర్నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## వర్షాల కోసం కప్పతల్లి ఆట

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండలంలోని బర్ధిపూర్ గ్రామంలో వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట ఆడారు. అనంతరం గ్రామ దేవతలకు నీళ్లు పోశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నారు. గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## గోదావరి నీళ్లతో గ్రామదేవతలకు జలాభిషేకం

**అక్షరటుడే, నందిపేట్:** వర్షాలు కురవాలని మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజలు గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. గోదావరి నది నుంచి నీళ్లు తీసుకొచ్చి ఊరేగింపుగా గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నందిపేట్ వీడీసీ ఛైర్మన్ ఎర్రం భోజేందర్, సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మెట్లపై నుంచి జారిపడి వృద్ధురాలు మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** ఇంట్లో మెట్లపై నుంచి జారిపడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. నగరంలోని గోసం గల్లీలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గోసం గల్లీకి చెందిన రాజవ్వ(75) గురువారం మధ్యాహ్నం ఇంటి స్లాబ్‌పై దుస్తులు ఆరేసేందుకు వెళ్లి తిరిగి కిందికి దిగుతూ అదుపుతప్పి కింద పడిపోయింది. గాయాలపాలైన రాజవ్వను వెంటనే కుటుంబీకులు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం మృతి చెందింది. నాల్గో టౌన్ ఎస్సై ఉదయ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




**అక్షరటుడే, ఆర్మూర్ :** మత్తు పదార్థాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్సై యాసిర్ అరాఫత్ అన్నారు. 'మన కాలనీ – మన భద్రత – మన బాధ్యత'లో భాగంగా శుక్రవారం ఆర్మూర్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ అవేర్నెస్, కాంటాక్ట్ కార్యక్రమాన్ని పట్టణంలోని నవ్య భారతి గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నియమ, నిబంధనలపై, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. సైబర్ నేరాలు సీసీ కెమెరాల వల్ల కలిగే ప్రయోజనాలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు విగ్నేష్, సుమతి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు పోగొట్టుకున్న పది మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. వీటిలో ఏడాది లోపు పోయినవి ఏడు, మూడేళ్ల క్రితం పోయినవి మూడు ఫోన్లు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో బాధితులు వంశీకృష్ణ, తలారి భూదేవి, ప్రశాంత్, సతీష్, చెంబుజీ సురేష్, దండి బాలాజీ, మందుల నారాయణ, బైక్లె సతీష్, ఆలకుంట రాజావింధర్, కిరణ్‌లకు ఫోన్లను అప్పగించారు.




## రేపు కేర్ డిగ్రీ కాలేజీలో సంచార జాతుల జిల్లా మహాసభ

**అక్షరటుడే, ఇందూరు:** సంచార జాతుల జిల్లా మహాసభను శనివారం నగరంలోని కేర్ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ మేరకు సంచార జాతుల జిల్లా అధ్యక్షుడు అజయ్, ప్రధాన కార్యదర్శి సదుల్లా రమేష్, కోశాధికారి రమేష్ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నెంబర్ 10 ప్రకారం.. గతంలో 36గా ఉన్న సంచార జాతుల జాబితాలోకి మరికొన్ని కులాలను చేర్చి, మొత్తం 51 కులాలను డీనోటిఫైడ్/సంచార జాతులుగా గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 4న మధ్యాహ్నం స్థానిక 'కేర్ డిగ్రీ కాలేజ్'లో సంచార కులాల ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సదస్సులో సంచార జాతుల ప్రజల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ప్రభుత్వం నుంచి లభించే ఫలాలు హక్కులపై చర్చించనున్నారు. అంతే కాకుండా సంఘం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. జిల్లాలోని బాధ్యులు, సభ్యులు, కులస్థులు తప్పనిసరిగా సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## మధ్యప్రదేశ్ నుంచి మృతదేహాన్ని రప్పించేందుకు ఎమ్మెల్యే సాయం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సదాశివనగర్‌కు చెందిన పలాటి పెద్ద రాజయ్య మధ్యప్రదేశ్‌లో కూలీ పనులకు వెళ్లి అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే నిరుపేద కుటుంబం కావడంతో తన తండ్రి మృతదేహాన్ని తీసుకొచ్చే పరిస్థితి లేదని కొడుకు వాపోయాడు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవ చూపారు. నిరుపేద దళిత కుటుంబానికి అండగా నిలిచి, మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు అంబులెన్స్ ఏర్పాటు చేయించారు. ఇందుకు అయ్యే రూ.50 వేల ఖర్చును తానే భరించారు. సదాశివనగర్ మండల కాంగ్రెస్ నాయకుల సమన్వయంతో మృతదేహాన్ని మధ్యప్రదేశ్ నుంచి సదాశివనగర్‌కు తీసుకువచ్చారు.



## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలో గంజాయి విక్రయాలకు అడ్డుకట్ట పడడంతో లేదు. తాజాగా ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



నగరంలోని పూలాంగ్, బోధన్ బస్టాండ్ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఎండు గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 200 గ్రాముల ఎండు గంజాయి, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో సీఐ వెంకటేష్, రామ్‌కుమార్, సిబ్బంది భూమన్న, విఠల్, లక్ష్మీనర్సయ్య, శివకుమార్ , సాయికుమార్, శ్యాంసుందర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శివాజీనగర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో గంగనీళ్ల కార్యక్రమం

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామదేవతలకు గంగనీళ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘంలోని ఆయా తర్పల పెద్దమనుషుల ఆధ్వర్యంలో పోతలింగయ్య గుడి వద్ద గంగనీళ్లు పోశారు.




చివరగా ఖిల్లా వద్ద గద్దెల వద్ద నీళ్లు పోశారు. అలాగే ఆదివారం వరదపాశం కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో శివాజీనగర్ మున్నూరుకాపు సంఘం పాలకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు, పాలకవర్గం సభ్యులు, తర్పల పెద్దకాపులు, పెద్దమనుషులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన తహశీల్దార్

**అక్షరటుడే, మెండోరా:** పోచంపాడ్ గ్రామంలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను మెండోరా తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఆర్ఐ వేణుగోపాల్ చారితో కలిసి పరిశీలించారు.



గురువారం నుంచి ప్రారంభమైన డిజిటలైజేషన్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. పోచంపాడ్ గ్రామంలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌కు సంబంధించిన పత్రాల పంపిణీ 99 శాతం పూర్తయిందన్నారు. మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించిన ఆయన.. గ్రామస్థులు అవసరమైన పత్రాలు, వివరాలను సకాలంలో సమర్పించి అధికారులకు సహకరించాలని కోరారు.